సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 27-3-2025

సంపుటి: 21 సంచిక: 2

పేజీలు: 8 వెల: రూ.1


## డ్రైనేజీలు, సీసీ రోడ్లు పరిశీలన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలెం-2, విశాఖ-ఏ కాలనీ ప్రాంతంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం పరిశీలించారు. అనంతరం స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైన్లు, సీసీ రోడ్డు పనులు సకాలంలో జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలు, సీసీ రోడ్లు నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరిగేలా అభివృద్ధి కార్యక్రమాలపై చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రాంతాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సచివాలయ సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.






- సామాజిక న్యాయశాఖా మంత్రితో 5 కులసంఘాలు భేటీ
- ఓబీసీ కోసం ఒక్క తాటిపైకి తెచ్చిన కేంద్రమంత్రి
- పార్లమెంట్ హాల్‌లో సమావేశం
- కృషి ఫలిస్తే చరిత్రకెక్కనున్న రామ్మోహన్‌నాయుడు

# హస్తినాపురిలో 'రాము'లోరి మంత్రాంగం

వయసు చిన్నదైనా కేంద్రంలో ఉన్నతమైన మంత్రిత్వ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తుండటమంటే చిన్నవిషయం కాదు. వారసత్వం ఉన్నంత మాత్రాన వ్యాధులు సంక్రమిస్తాయేమో గానీ పదవులు అయాచితంగా రావు. ఒక సక్సెస్ రావాలంటే కన్నీరు పెట్టుకోవాలి.. కష్టాలు ఎదుర్కోవాలి.. బాధలు తట్టుకోవాలి.. మనసుకు గాయాలు కావాలి.. మాటలకు గుండె ముక్కలు కావాలి.. ఎదురుదెబ్బలు తినాలి.. బంధాలను కోల్పోవాలి.. సహనంతో మెలగాలి.. గుణపాఠాలు నేర్చుకోవాలి.. తప్పులు దిద్దుకోవాలి.. అన్నిటికంటే మించి నీతో నువ్వు యుద్ధం చేయాలి. పోకిరి సినిమాలో మహేష్‌బాబు అన్నట్టు ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా.. బుల్లెట్ దిగిందా? లేదా? అన్నదే ఇప్పటి బతుకు సూత్రం. ఈతరం రాజకీయాలకు ఈ కాలం నాయకుడు ఎలా ఉండాలి అనే ప్రశ్న వస్తే కచ్చితంగా దేశంలో ఓ డజను పేర్లు వినిపిస్తాయి. అందులో మన తెలుగు రాష్ట్రాల్లో కింజరాపు రామ్మోహన్ నాయుడు కచ్చితంగా ఉంటారు. ఎందుకంటే.. ఆయన చేస్తున్నది రాజకీయమని ఆయనకే తెలియనంతగా మమేకమైన పనితీరు రామ్మోహన్‌ది. అందుకు ఒక తాజా ఉదాహరణ చూద్దాం.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రస్తుతం ఢిల్లీలో శిష్టకరణ, కళింగకోమటి, తూర్పు కాపు, సొండి, అరవ సామాజికవర్గాలకు చెందిన కుల సంఘాల నేతలు ఉన్నారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత కేంద్ర సామాజిక న్యాయ శాఖామంత్రి బీరేంద్రకుమార్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ద్వారా పార్లమెంట్ హాల్‌లో కలవనున్నారు. ఈ కులాలను కేంద్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాలో చేర్చాలని ఓ వినతిపత్రం ఇవ్వడంతో పాటు అందుకు గల అవసరాన్ని కేంద్రమంత్రికి వివరించనున్నారు. అసలు సంబంధిత మంత్రితో ఈ సమావేశాన్ని ఏర్పాటుచేసింది రామ్మోహన్‌నాయుడే. దేశంలోనే అత్యున్నత సభ పార్లమెంట్ సమావేశ మందిరంలో ఈ కులసంఘ నేతలతో మంత్రిని భేటీపర్చడం రాష్ట్ర చరిత్రలోనే ప్రముఖ ఘట్టం. గతంలో అనేకమార్లు తమను ఓబీసీలో చేర్చాలని ఎన్‌సీబీసీకి అనేక కుల సంఘ నేతలు అనేక పార్టీల తరఫున కలవడం, తమ వాణిని వినిపించడం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు కేవలం ఐదు కుల సంఘాలు మాత్రమే తమను ఓబీసీలో చేర్చమని మంత్రి బీరేంద్రకుమార్‌ను అడుగుతున్నాయంటే దాని వెనుక రామ్మోహన్ నాయుడు మంత్రాంగం స్పష్టంగా కనిపిస్తుంది. వాస్తవానికి రాష్ట్రంలో బీసీగా నోటిఫై అయి కేంద్రంలో ఓబీసీ కాని కులాలు 29 ఉన్నాయి. అందులో కేవలం ఈ ఐదు కుల సంఘాలకు మాత్రమే పిలుపు రావడం వెనుక రామ్మోహన్‌నాయుడు ఎత్తుగడ కనిపిస్తుంది. ఒక్క అరవల సామాజికవర్గం మినహా మిగిలిన నాలుగు కుల సంఘాల్లోనూ గ్రూపులు ఉన్నాయి. వీరందర్నీ ఒక్క తాటిమీదకు తెచ్చి ఒక్క మాట మాత్రమే మంత్రికి చెప్పాలని రామ్మోహన్ నాయుడు దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగానే గురువారం ఉదయం నాటికి అందరూ ఢిల్లీ చేరుకున్నారు. శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఈ ఐదు కులాలు కలిపి దాదాపు నాలుగు లక్షల మంది ఉంటారు. ఇప్పుడు వీరిని ఓబీసీలో చేర్చడం ద్వారా కాళింగులకు బొడ్డేపల్లి రాజగోపాలరావు ఎలాగో, ఈ ఐదు కులాలకు కింజరాపు రామ్మోహన్ నాయుడు అంతే అన్న స్థాయికి ఎగబాకనున్నారు. దాల్వా సుబ్రహ్మణ్యం కమిషన్ నివేదిక మేరకు బీసీలైనవారిలో తూర్పుకాపులు కేవలం ఉత్తరాంధ్రలో మాత్రమే ఓబీసీలుగా

- మిగతా చివరి పేజీలో




• ఎడిటోరియల్

# గత ఎన్నికల ఖర్చు రూ.3,861 కోట్లట!

**2024**లో పార్టీల ఖర్చు రూ. 3,861 కోట్లు.. అనధికారిక లెక్క లక్ష కోట్లపైనే.. ఆదాయ, వ్యయాల్లో బీజేపీయే టాప్.. ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది?.. ఎన్నికల్లో విజయం సాధించడానికి రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికలు ఏవైనా వ్యయం మాత్రం కొండలా పెరిగిపోతూనే ఉంది. గత సంవత్సరం దేశంలో ఐదు ఎన్నికలు జరిగాయి. వీటికి అయిన ఖర్చు ఎంతో తెలుసా? అక్షరాలా రూ.3,861 కోట్లు. ఒక్క లోక్‌సభ ఎన్నికలకే రూ.1.35 లక్షల కోట్లు ఖర్చు చేశారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ సంస్థ నిర్వహించిన అధ్యయనం తెలిపింది. అయితే ఇది అనధికారిక అంచనా. మరి లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు చేసిన ఖర్చుపై ఎన్నికల కమిషన్ వెల్లడించిన అధికారిక లెక్కలు ఎలా ఉన్నాయి? రాజకీయ పార్టీలు తమ ఆదాయాన్ని, వ్యయాన్ని తెలియజేస్తూ ఎన్నికల కమిషన్‌కు నివేదికలు అందిస్తుంటాయి. అయితే అందులో పూర్తి వివరాలుండవు. కొన్ని జమా ఖర్చులను రహస్యంగా ఉంచుతాయి. వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన వివరాల ఆధారంగా కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ (సీహెచ్ఆర్ఐ) అనే సంస్థ ఇటీవల ఓ అధ్యయనం జరిపింది. అధికారం కోసం రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ఏ స్థాయిలో విచ్చలవిడిగా డబ్బును ఖర్చు చేస్తాయో ఈ అధ్యయనం బయటపెట్టింది. ఆదాయంలోనే కాదు.. ఖర్చులోనూ అధికార బీజేపీదే పైచేయి. అధికార గణాంకాల అధ్యయనం ప్రకారం కేవలం 22 పార్టీలు రూ.18,742.31 కోట్లు ఖర్చు చేశాయి. వీటిలో ఆమ్‌ఆద్మీ, అసోం గణపరిషత్, అన్నా డీఎంకే, మజ్లిస్, తృణమూల్ కాంగ్రెస్, ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్, బీజేడీ, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ(ఎం), డీఎంకే, కాంగ్రెస్, జేడీఎస్, జేడీయూ, ఎల్జేపీ (రాం విలాస్), ఆర్జేడీ, సమాజ్‌వాదీ, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్, సిక్కిం క్రాంతికారి మోర్చ, టీడీపీ, వైకాపా ఉన్నాయి. ఇవన్నీ ఎన్నికల కోసం రూ.3,861.57 కోట్లు ఖర్చు చేయగా, ఒక్క బీజేపీయే రూ.1,737.68 కోట్లు.. అంటే మొత్తం వ్యయంలో 45 శాతం ఖర్చు చేసింది. అన్ని పార్టీలకూ కలిపి రూ.7,416.31 కోట్లు విరాళాల రూపంలో అందగా, అందులో 84.5 శాతం ఒక్క బీజేపీ ఖాతాకే చేరాయి. కేవలం ఏడు పార్టీలు అందజేసిన వివరాల ప్రకారం ప్రింట్, టీవీ, డిజిటల్ వేదికల ద్వారా మీడియా ప్రకటనల కోసం రూ.992.48 కోట్లు, సోషల్ మీడియా, వర్చువల్ ప్రచారం కోసం రూ.196.23 కోట్లు ఖర్చు చేశారని సీహెచ్ఆర్ఐ డైరెక్టర్ వెంకటేష్ నాయక్ తెలిపారు. స్టార్ క్యాంపెయినర్ల హెలికాప్టర్, ప్రైవేటు జెట్ల ప్రయాణాలకు రూ.830.15 కోట్లు ఖర్చయ్యాయి. ఇక బ్యానర్లు, హోర్డింగులు, పోస్టర్లు, ఇతర ప్రచార సామగ్రి నిమిత్తం రూ.398.49 కోట్లు ఖర్చు చేశారు. వివిధ రాజకీయ పార్టీలకు నగదు ఎలా లభించింది అని అడిగిన ప్రశ్నకు వెంకటేష్ నాయక్ సమాధానమిస్తూ 'జవాబు దొరకని ప్రశ్నలు అనేకం ఉన్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీల ఖాతాలలో రూ.14.848.46 కోట్లు నిల్వ ఉన్నాయి. ఈ అదనపు సొమ్ము ఎక్కడికి పోతుంది? బీజేపీ సహా ఆరు పార్టీల వద్ద ఎన్నికల ప్రారంభంలో కంటే ముగిసిన తర్వాతే ఎక్కువ సొమ్ము ఉంది. ఇది ఎలా సాధ్యం? సీపీఐ, జేఎంఎం, శివసేన, శిరోమణి అకాలీదళ్ సహా అనేక పార్టీలు తమ ఖర్చుల వివరాలే ఇవ్వలేదు' అని చెప్పారు. 'దిగ్భ్రాంతి కలిగిస్తున్న ఈ లెక్కల్ని చూస్తుంటే ఒక విషయం స్పష్టమవుతోంది. దేశంలో ఎన్నికలు ఇంకెంతో కాలం ప్రజాస్వామ్యం గురించి జరగబోవు. అవి ధనాన్ని విచ్చలవిడిగా వెదజల్లే యుద్ధ క్షేత్రాలుగా మారుతాయి. రాజకీయ పార్టీలు ఈ విధంగా డబ్బును మంచినీళ్ల మాదిరిగా ఖర్చు చేస్తుంటే సామాన్య మానవుడి మనసులో ఓ ప్రశ్న మెదులుతుంది. ఈ డబ్బంతా ఎక్కడి నుంచి వస్తోంది? చివరికి ప్రయోజనం పొందేది ఎవరు? ఏదేమైనా ఎన్నికలలో ఓట్లు కాదు.. డబ్బే నిర్ణయాత్మక పాత్ర పోషించబోతోంది. భారత రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించబోయేది డబ్బే. ఈ ధన ప్రవాహాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకోగలదా? లేదా ధనబలం, గోప్యత ఇలా కొనసాగుతాయా? అనేదే తేలాల్సి ఉంది' అని వెంకటేష్ నాయక్ చెప్పారు.

## ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి జిల్లా హాస్పిటల్ ఆవరణంలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ఈఎంటిలకు యునైటెడ్ కింగ్డమ్ మాడ్యుల్ అనుగుణంగా శిక్షణ అందించారు. జిల్లా ఏ.ఈ.ఎం.ఎస్ మేనేజర్ హరిప్రసాద్, ఓ.ఈ రంగప్రసాద్‌ల పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ తరగతులు నిర్వహించారు. అత్యవసర పిడియాట్రిక్ ఎమర్జెన్సీ వైద్య సేవలు గురించి వివరిస్తూ ఇటువంటి పరిస్థితుల్లో ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలో అలాగే ఎటువంటి మందులు ఇవ్వాలో అనే వాటిపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో టెక్కలి,పలాస, శ్రీకాకుళం డివిజన్‌లలో పనిచేస్తున్న సుమారు 20మంది ఈ.ఎం.టీ.లు శిక్షణ పొందారు.



## ప్రవీణ్ మృతికి సంతాపం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాజమండ్రికి చెందిన ఫాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి జిల్లాకు చెందిన పలు ఫాస్టర్ల సంఘాలు సంతాపం ప్రకటించాయి. ఈమేరకు శ్రీకాకుళం మండల అర్బన్ ఫాస్టర్స్ ఫెలోషిప్, శ్రీకాకుళం జిల్లా ఫాస్టర్స్ ఫెలోషిప్, శ్రీకాకుళం జిల్లా క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవీణ్ మృతి క్రైస్తవ సంఘానికి తీరని లోటన్నారు. గొప్ప వక్త, మానవతావాది, సంఘ సంస్కర్త, క్రైస్తవుల పక్షాన బలమైన స్వరాన్ని వినిపించే ప్రవీణ్ మృతి చెందారన్న విషయం తెలిసినపుడు క్రైస్తవ లోకం విస్తుపోయిందన్నారు. ప్రవీణ్ మృతిపై ఎన్నో అనుమానాలు ఉన్నాయన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉన్నతస్థాయిలో విచారణ చేసి తగిన న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయా సంఘాలు కోరాయి. దీనిపై తదుపరి కార్యాచరణ నిమిత్తం ఎస్ఎంయూపీ, జిల్లా ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆలోచన చేస్తుందన్నారు.

## కదిలిన రెవెన్యూ యంత్రాంగం


ఒడిశా సరిహద్దులో రెచ్చిపోతున్న ఇసుకాసురులు

(సత్యంన్యూస్, కొత్తూరు)
కొత్తూరు మండలం రాయల గ్రామ సమీపంలో వంశధార నదిలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వేసి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. పక్కనే ఉన్న ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో డంప్ చేసి రాత్రి వేళల్లో టిప్పర్లకు లోడింగ్ చేస్తూ ఒడిశాలోని పర్లాకిమిడి, గుణుపూర్ పట్టణాలకు తరలిస్తున్నారు. అక్కడ టిప్పర్ లోడ్ ఇసుకను ఎనిమిది వేల రూపాయలకు అమ్ముతున్నారు. ప్రభుత్వ ఆంక్షలకు తూట్లు పొడుస్తూ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన అక్రమార్కులు అక్రమ ఇసుక రవాణా, అమ్మకాలు సాగిస్తున్నారు. రెవెన్యూ, మైన్స్, పోలీసు అధికారులు స్పందించి ఇసుక అక్రమాలను అరికట్టాలని చర్యలు ప్రజలు కోరుతున్నారు.

(సత్యంన్యూస్, కొత్తూరు)

సత్యం కథానానికి స్పందించిన రెవెన్యూ యంత్రాంగం ఒరిస్సా సరిహద్దుల్లో రెచ్చిపోతున్న ఇసుకసురులు అనే కథనానికి కొత్తూరు రెవిన్యూ శాఖ స్పందించి సదరు ప్రాంతాన్ని సందర్శించి కొత్తూరు ఎమ్మార్వో రవి చంద్ర ఇసుక డంపింగ్ పరిశీలన చేసి అక్రమ ఇసుక నిల్వలు అని గుర్తించి కేసును నమోదు చేశారు ఆయన వెంటఆర్ ఐవిఆర్ఓ పోలీస్ సిబ్బంది ఉన్నారు



## మానవత్వం చాటుకున్న రైల్వే ఆర్‌పీఎఫ్

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

శ్రీకాకుళంరోడ్ ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో టిక్కెట్ తీసుకునేందుకు వచ్చిన అంధ ప్రయాణికుడు అక్కడ విధులు నిర్వహిస్తున్న రైల్వే ఆర్పీఎఫ్ ఆయన కంటపడడంతో వెంటనే స్పందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ ప్రయాణీకుడిని దగ్గరుండి చేయి పట్టుకొని టిక్కెట్ కౌంటర్ వద్ద టిక్కెట్ ఇప్పించి ఆయనతో పాటు రైల్వే స్టేషన్ వరకు పట్టుకొని వెళ్లి రైలు ఎక్కించారు.



## జంధ్యాలకు అంతర్జాతీయ కవితా సదస్సు ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వచ్చేనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే అంతర్జాతీయ సాహితీ సమ్మేళనానికి పత్రికా రచయిత, శ్రీకాకుళం వాసి జంధ్యాల శరత్ బాబు ఎంపికయ్యారు. నిర్వహణ బాధ్యతను వంగూరి ఫౌండేషన్, శ్రీ సాంస్కృతిక కళాసారథి- సింగపూర్, వంశీ ఇంటర్నేషనల్ సంస్థలు సంయుక్తంగా చేపట్టాయి. 13న చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో తెలుగు వెలుగుల గురించి కవితా పఠనం చేయాలని సమ్మేళన సమన్వయకర్త మంగిపూడి రాధిక నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి ఎంపిక చేసి ఆహ్వానించామని నిర్వాహకులు తెలిపారు. తొలిసభలో హైదరాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, కొత్తగూడెం, కాకినాడలతోపాటు ముంబయి, అండమాన్ నికోబార్ ప్రాంతాల నుంచి ఎంపికైన కవులు పాల్గొంటారన్నారు.

## నిరుపయోగంగా ఉన్న హాస్టల్స్




(సత్యంన్యూస్ కొత్తూరు)

కొత్తూరు మండల కేంద్రంలో బీసీ ఎస్సీ ఎస్టీ హాస్టల్స్, బాలికల హాస్టల్స్ మొత్తం దాదాపుగా 5 ఉన్నాయి. పక్క భవనాలు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యమో, నాయకుల స్వయంకృత అపరాధమో తెలియదు కానీ కోట్లు విలువ చేసే ఆస్తులను గాలికి వదిలేస్తున్నారు. ముఖ్యంగా కొత్తూరు మండలం శ్రీకాకుళం రోడ్‌లోగల హాస్టల్ కేవలం ఆర్&బికాలువ సరిగ్గా లేకపోవడం వలన హాస్టల్ మూతపడింది. వీటిని అధికారులు వస్తున్నారు పరిశీలిస్తున్నారు వెళుతున్నారు చర్యలు మాత్రం శూన్యం. కొంతమంది అధికారులు నిర్లక్ష్యంతోపాటు నాయకుల ఒత్తిడి వలన ఈ ఆర్ అండ్ బి కాలువను పూర్తిగా గాలికి వదిలేశారు. వర్షం పడితే ఈ హాస్టల్‌లో వరద వస్తుంది దాని మూలంగా గత సంవత్సరంనర కాలం నుండి ఈ హాస్టల్లో మూసివేశారు. మూసివేసిన హాస్టల్‌ని వినియోగంలోకి తేవాలి అని ప్రజలు కోరుకుంటూన్నారు.




# సినిమాల్లో విరాట్ కోహ్లీ..నిజమెంత?

మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని చెబుతుంటారు. విరాట్ కోహ్లీని పోలిన ఏడుగురు ఈ ప్రపంచంలో ఎక్కడెక్కడ ఉన్నారో కనిపెట్టగలరా? ఇందులో ఒకరు టర్కీలో దొరికారు. కెమెరాకు చిక్కిన అతడిని ఇప్పుడు భారతీయ మీడియా వెంటాడి వేధిస్తోంది. ఈ ఫోటో బయటపడ్డాక.. విరాట్ కోహ్లీ టర్కిష్ సినిమాలో నటిస్తున్నారా? అంటూ బోలెడన్ని కామెడీలు చేస్తున్నారు. భారత క్రికెటర్ కోహ్లీతో సిసలైన పోలికను కలిగి ఉన్న టర్కిష్ నటుడిని చూసిన తర్వాత రెడ్డిటర్లు చాలా సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. కోహ్లీకి ప్రపంచవ్యాప్తంగా భారీ అభిమానులు ఉన్నారు. అతడు బాలీవుడ్ నటి అనుష్క శర్మను పెళ్లాడాక ఈ ఫాలోయింగ్ మరింతగా పెరిగింది. అయితే టర్కిష్ టెలివిజన్ సిరీస్ లో నటుడు స్టార్ క్రికెటర్ కోహ్లీని పోలి కనిపించగానే నెటిజనులు షాకయ్యారు. ఇంటర్నెట్ లో అతడి ఫోటోలను కోహ్లీ ఫోటోలతో కలిపి పోల్చి చూస్తున్నారు. సోమవారం ఒక రెడ్డిటర్ టర్కిష్ నటుడు కావిట్ సెటిన్ గునర్ నటించిన టర్కిష్ హిస్టారికల్ డ్రామా "దిరిలిస్: ఎర్టుగ్రుల్" నుండి స్క్రీన్‌షాట్‌ను షేర్ చేసాడు. "అనుష్క శర్మ భర్త టీవీ షో అరంగేట్రం" అనే ట్యాగ్‌ని సరదాగా జోడించారు. దీనికి నెటిజనుల నుంచి అసాధారణ స్పందన వచ్చింది. చాలా మంది అభిమానులు టర్కిష్ నటుడు కోహ్లీతో చాలా పోలి ఉన్నారని అంగీకరించారు. రెడిట్‌లో ఇంకా చాలా కామెడీలు కనిపిస్తున్నాయి. "ఇది జోక్ కాదు. ఎర్టుగ్రుల్‌లో ఈ డోగన్ బే పాత్రను నేను మొదటిసారి చూసినప్పుడు... టర్కిష్ సిరీస్‌లో కోహ్లీ ఏం చేస్తున్నాడోనని నాకు అనిపించింది? అచ్చం ఒకరినొకరు పోలి ఉన్నారు.. అని అన్నారు. మరొకరు "టర్కిష్ కోహ్లీ" అని ఒకరు వ్యాఖ్యానించారు. మెహ్మెట్ బోజ్‌డాగ్ నిర్మించిన టర్కిష్ సిరీస్ **2014**లో మొదటిసారి ప్రసారం అయి ఐదు విజయవంతమైన సీజన్ల తర్వాత **2019**లో ముగిసింది. ఇది చారిత్రక కాల్పనిక అడ్వెంచర్ డ్రామా. ఇందులో ఎర్టుగ్రుల్ బే పాత్రలో ఇంజిన్ అల్టాన్ దుజ్యాతన్ ప్రధాన పాత్రలో నటించారు. ఈ షో ఒట్టోమన్ సామ్రాజ్యాన్ని స్థాపించిన ఉస్మాన్ తండ్రి ఎర్టుగ్రుల్ జీవితం ఆధారంగా రూపొందింది. ఈ సిరీస్ భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన ప్రజాదరణ పొందింది. వినోద పరిశ్రమతో విరాట్ కోహ్లీ అనుబంధాన్ని పరిశీలిస్తే.. విరాట్ కోహ్లీ చాలా వాణిజ్య ప్రకటనలలో కనిపించారు. అయితే అతడు ఎప్పుడూ సినిమా లేదా టీవీ షోలో నటించలేదు. ఇటీవల ఐపీఎల్ **-2025** ప్రారంభోత్సవంలో బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్‌తో కలిసి కోహ్లీ జూమ్ జో పఠాన్‌కు నృత్యం చేస్తూ సిగ్నేచర్ హుక్ స్టెప్‌ను ప్రదర్శిస్తూ కనిపించాడు. ఈ ఇద్దరి ప్రదర్శన వీడియో వేగంగా వైరల్ అయ్యింది. సోషల్ మీడియాలో కలకలం రేపింది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# చిరు-వెంకీ.. ఇలా ఆగిపోయింది



చిరంజీవితో సినిమా చేయాలనుకునే జాబితాలో వున్న దర్శకుల్లో వెంకీ కుడుముల ఒకరు. భీష్మ తర్వాత వెంకీకి మెగా కబురు వచ్చింది. ఓ కథని చెప్పారు. అది ఎంతకీ ముందుకు సాగలేదు. నిజానికి వశిష్ట, అనిల్ రావిపూడి కి ముందే వెంకీకి పచ్చజెండా ఊపారు చిరు. కానీ ఈ సినిమా ముందుకు వెళ్ళలేదు. దీనికి గల కారణం స్వయంగా వెంకీనే చెప్పారు. 'భీష్మ సినిమా తర్వాత చిరంజీవి గారి కోసం ఒక కథ అనుకు న్నాను. ఆయనకి ఫస్ట్ ఐడియా చెప్తే చాలా ఎక్సైట్ అయ్యారు. నేను చిరంజీవి గారికి ఫ్యాన్ బాయ్ ని. ఆయన తో చేసే సినిమా చాలా ప్రత్యేకంగా వుండాలని స్టోరీ, స్క్రీన్ ప్లే డెవలప్మెంట్ కి చాలా సమయం తీసుకుని చేశాను. అయితే ఎక్కడో ఓ చోట ఆయన్ని మెప్పించలేపోయాను.మేము అనుకున్నలాగా అది అవ్వలేదు. మరో కథతో వస్తానని చెప్పి వచ్చేశాను' అని జరిగిన సంగతి చెప్పారు వెంకీ. అయితే ఎప్పటికైనా చిరుతో సినిమా తీసి తీరుతా అని నమ్మకంగా వున్నారు వెంకీ. ఆయన డైరెక్ట్ చేసి రాబిన్ హుడ్ ఈనెల 28న వస్తోంది. ఈ సినిమా విజయం సాధిస్తే గనుక మళ్ళీ మెగా తలుపులు తెచురుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# యాక్టర్.. ఇప్పుడు డాక్టరైంది!

టాలీవుడ్ బాలీవుడ్‌లో శ్రీలీల పేరు మార్మోగుతోంది. కోలీవుడ్ లోను అడుగుపెడుతోంది. నేటితరంలో అరుదైన ఎనర్జీ డ్యాన్స్ స్కిల్ ఉన్న ప్రతిభావంతురాలిగా శ్రీలీలకు గుర్తింపు దక్కింది. ఈ భామ తదుపరి 'రాబిన్‌హుడ్'తో ప్రేక్షకులను అబ్బురపరచనుంది. ఈ సినిమా తన కెరీర్‌లో గొప్ప వినోదాత్మక చిత్రమని శ్రీలీల చెబుతోంది. నితిన్‌తో కలిసి పనిచేయడం ఇది రెండవసారి. రాబిన్ హుడ్ లో శ్రీలీల ఎన్నారై యువతి నీరా వాసుదేవ్ గా నటించింది. అందం ఆకర్షణ విచిత్రాలతో నిండిన నీరా ఈ ప్రపంచం తన చుట్టూ తిరుగుతుందని నమ్ముతుంది. ఇలా ఊహించుకుంటూ ఆనందంగా గడిపేస్తుంటే అప్పుడు తనకు ఎదురైనవాడు ఎలాంటి వాడు? అన్నది తెరపైనే చూడాలి. నిజానికి ఈ పాత్రలో రష్మిక మందన్నను నటింపజేయాలని దర్శకుడు భావించారు. కానీ 'పుష్ప 2' కమిట్‌మెంట్‌ల కారణంగా రష్మిక దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత శ్రీలీలను ఈ అరుదైన అవకాశం వరించింది. ఆసక్తికరంగా రష్మిక నటించిన పుష్ప 2లో శ్రీలీల కిసిక్ అనే ప్రత్యేక గీతంలో నర్తించిన సంగతి తెలిసిందే. శ్రీలీల ఎనర్జిటిక్ డ్యాన్సులకు యూత్ ఫిదా అయింది. శ్రీలీల ఇంతకుముందు ఏడాది పాటు విరామం తీసుకున్న సంగతి తెలిసిందే. కానీ అది కారణం లేకుండా కాదు. 2023లో చాలా బిజీగా గడిపిన ఈ బ్యూటీ పెండింగ్ షూటింగ్‌లు పూర్తి చేసి, ఎంబీబీఎస్ చివరి సంవత్సరం విద్యను కొనసాగించింది. స్టడీస్‌పై శ్రద్ధ పెట్టేందుకు గ్యాప్ తీసుకుంది. ఎట్టకేలకు దీనికి మంచి ఫలితం వచ్చింది. ఇప్పుడు చేతిలో డిగ్రీతో శ్రీలీల ఆనందంగా ఉంది. గతంలో కంటే ఎక్కువ నమ్మకంగా ఉత్సాహంగా ఉంది. ఇకపై శ్రీలీలను డాక్టరమ్మ శ్రీలీల అని పిలవొచ్చు. శ్రీలీల కొంత విరామం తర్వాత ఇప్పుడు రాబిన్‌హుడ్‌తో తిరిగి రాబోతోంది. తదుపరి శ్రీలీల లైనప్ చాలా పెద్దదిగానే ఉంది. అటు తమిళ చిత్రం "పరాశక్తి"లో శివకార్తికేయన్ సరసన నటిస్తోంది. రవితేజతో 'మాస్ జాతర'లో అవకాశం అందుకుంది. మరోవైపు బాలీవుడ్ లో క్రేజీగా ఆషిఖి 3లోను నటిస్తోంది.



- తుపాకి.కామ్ సౌజన్యంతో..

# 4న రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

**- పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రీన్ దేవభూషణరావు**

(శ్రీకాకుళం)

రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ ఫిజిక్ మోడలింగ్ కాంపిటేషన్ పోటీలను ఈ నెల 4న భీమవరం నిర్వహించనున్నట్టు జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రీన్ దేవభూషణరావు అన్నారు. నగరంలోని ఓ ప్రయివేటు భవనంలో రాక్‌లైన్ జిమ్ ఆధ్వర్యంలో స్టేట్ బాడీబిల్డింగ్, ఫిజిక్ మోడలింగ్ కాంపిటేషన్ పోస్టర్‌ను జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రీన్ దేవభూషణరావు, ఆంధ్రా బాడీబిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు మాట్లాడుతూ బాడీబిల్డింగ్ క్రీడకు యువతలో ఎంతో ఆదరణ ఉందన్నారు. 55, 60, 65, 70, 75, 80, 85 కేజీల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని వివరించారు. బాడీబిల్డింగ్‌లో చాంపియన్ ఆఫ్ ది చాంపియన్‌గా నిలిచిన అభ్యర్థి రూ.25వేలు ప్రైజ్‌మనీ అందజేస్తామని చెప్పారు. ఫిజిక్ మోడలింగ్ కేటగిరీలో 165 దాటిన విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారి బహుమతులు అందజేస్తామని అన్నారు. ఈ క్యాటగిరీలో చాంపియన్ ఆఫ్ ది చాంపియన్‌గా నిలిచిన వారికి రూ.10వేలు అందజేయనున్నట్టు శ్రీనివాసరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బాడీబిల్డర్ వి విజయ్‌కుమార్, బాడీబిల్డర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె గౌరీశంకర్, కోశాధికారి బట్న నవీణ్, యువత పాల్గొన్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీలో రెడ్డి శాంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ నియామకం చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కమిటీలో చైర్మన్‌గా శెట్టిపల్లి రఘురామిరెడ్డి, మెంబర్లుగా రెడ్డి శాంతి, తానేటి వనిత, కైలే అనిల్‌కుమార్, వై.విశ్వశ్వరరెడ్డిలను నియమించినట్లు తెలిపారు.



# లేఆఫ్ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్యాంపిస్టన్స్ పరిశ్రమలో కార్మికుల లే ఆఫ్ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని కోరుతూ మార్చి 29న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రణస్థలం మండలంలో గల శ్యాంక్రగ్ పిస్టన్స్(రింగ్స్) ప్లాంట్-2 పరిశ్రమలో 200 మంది కార్మికులను లే ఆఫ్ చేయకుండా యాజమాన్యాన్ని ఆదేశించాలని, బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మిక, ఉద్యోగ, రైతు ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు అధ్యక్షతన గురువారం శ్రీకాకుళంలో యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్యాంపిస్టన్స్ యాజమాన్యం 200మంది కార్మికులను లే ఆఫ్ చేయటం కోసం ప్రభుత్వ అనుమతికై దరఖాస్తు చేసారని తెలిపారు. కార్మికులు ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి పనిలో నుండి తీసివేస్తారని భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఏ విధమైన లేఆఫ్‌లూ చేయవద్దని యాజమాన్యం వారిని ప్రభుత్వం ఆదేశించవలసిందిగా కోరారు. వేతన ఒప్పందం ప్రకారం గత 5సంవత్సరాలుగా బోనస్ చెల్లించడం లేదని, గత అక్టోబర్‌లో చెల్లించాల్సిన బోనస్ నేటికీ చెల్లించలేదని తెలిపారు. యాజమాన్యం 30సంవత్సరాలు సర్వీసు పూర్తయినదని కార్మికులను బలవంతంగా రిటైర్మెంట్ చేస్తున్నారని, ఇప్పటి వరకు అక్రమంగా 120 మంది కార్మికులను బలవంతపు రిటైర్మెంట్ చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇదే జీవనాధారంగా ఉన్న కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బలవంతపు రిటైర్మెంట్ నిలుపుదల చేసి అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకునేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు ఇస్తామన్న హెల్త్‌కార్డులు ఇవ్వలేదని, చనిపోయిన కార్మిక కుటుంబాలకు చెల్లించాల్సిన చెల్లింపులు చెల్లించలేదని తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా వేతన ఒప్పందం చేయలేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా 200మంది కార్మికులను రోడ్డున పెట్టడానికి యాజమాన్యం సిద్ధమయిందన్నారు. ప్రభుత్వానికి లే ఆఫ్ కోరడానికి అవసరమైన లాభనష్టాలకు సంబంధించినవి గానీ ఎబిసి వంటి ఎటువంటి రికార్డులు కూడా ఇవ్వలేదన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయడమే కాకుండా ఉన్న పరిశ్రమలలో కార్మికుల ఉపాధి పోకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసు, వైఎస్ ఆర్ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్.వెంకటరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.చందర్రావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్& హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3 వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.వి.రమణ, నాగార్జున అగ్రికెమ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, నాగార్జున అగ్రికెమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.రామప్పుడు, ఎమ్.రమణ, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు పి.చంద్రశేఖర్, వి.ఆర్.ఎ సంఘం జిల్లా అధ్యక్షులు టి.త్రినాధరావు, ఎపి మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర, రిమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాకోటి.చిన్నారావు, బి.ఎస్.ఎన్.ఎల్ యూనియన్ నాయకులు ఎమ్.గోవర్ధనరావు, జిల్లా కళాసి యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.సూరయ్య, సిఐటియు పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్, శ్యామ్ క్రగ్ పిస్టన్స్ (రింగ్స్) వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎమ్.అప్పలనర్సయ్య తదితరులు మాట్లాడి మద్దతు ప్రకటించారు.

# 29న తెరవే ఉగాది స్వాగత సమ్మేళనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగు రచయితల వేదిక(తెరవే)ఆధ్వర్యంలో ఈ నెల 29న సాయంత్రం 4గంటలకు స్థానిక శాంతినికేతన్ కళాశాలలో విశ్వావసు నామ ఉగాది స్వాగత సమ్మేళనం జరుగుతుంది. గురువారం ఈ విషయాన్ని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకటరమణమూర్తి తెలిపారు. కార్యక్రమానికి యు.నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. సభా నిర్వాహకునిగా ఆర్.వి.రమణమూర్తిలు ఒక ప్రకటనలో తెలిపారు. సమన్వయకర్తగా కోనే శ్రీధర్ వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా సెట్‌శ్రీ పూర్వపు సి.ఇ.వో సురంగి మోహనరావు, డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గుంట లీలా వరప్రసాదరావు, విశ్రాంత ఉపవిద్యాశాఖాధికారులు ఇసాయి వెంకటరావు, మహేష్ చంద్రసామంత్ పాల్గొంటారు. సంస్థసభ్యులు కిమ్మి సంతోష్ కుమార్ సారథ్యంలో జరుగు సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం స్వీయ కవితా పఠనం జరుగుతుంది. ఇదే వేదికపై నామ విజ్ఞాన వేత్త వాండ్రంగి కొండలరావు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మణిపాత్రుని నాగేశ్వరరావు, ప్రముఖ కథకులు, వ్యాసకర్త గొర్లె జగ్గునాయుడును సన్మానిస్తారు. అలాగే కవి సమ్మేళనంలో పాల్గొన్న రచయితలను సత్కరిస్తారు. డా.సత్యం ఫౌండేషన్(భీమడోలు) సౌజన్యంతో దివంగత ప్రముఖ రచయిత డాక్టర్ బి.ఎస్.ప్రసాద్ రాసిన "వెన్నెల వెలుగులు"అనే సాహిత్య పుస్తకాలను సభ్యులకు అందజేస్తారు.

# కిడ్నీ వ్యాధిపై అవగాహన

(సత్యంన్యూస్, పలాస)

బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉద్దానం సేవా సమితి సువర్ణపురం ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈసందర్భంగా వారు ఎక్కువగా మంచి నీరు తాగినట్లయితే కిడ్నీ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలియజేశారు. సుమారు ఒక్కొక్కరికి ఒక్కొక్క బాటిల్ చొప్పున సుమారు 200 వాటర్ బాటిల్ పంపిణీ చేశారు. ఈ విషయాలను విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.మల్లేశ్వరరావు, కె.రమేష్, దామోదర్‌రావు, లక్ష్మీబాను, సత్యనారాయణ, ప్రసాదు, భవాని, సూర్యకుమారి, కృష్ణ, పురుషోత్తము, శ్రీరాము పాల్గొన్నారు.



# హక్కులు,సైబర్ నేరాలపై అవగాహన అవసరం

(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)

వినియోగదారులు తమ హక్కులపై అవగాహన ఏర్పరుచుకోవాలని జవహర్ నవోదయవిద్యాలయం ప్రిన్సిపల్ పరుశరామయ్య అన్నారు. వినియోగదారుల హక్కులు, సైబర్ నేరాలపై ఆశ్రా ఆధ్వర్యంలో మండలంలోని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో వినియోగదారుల హక్కులు, బాధ్య తలు,సైబర్ నేరాలు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఏడ్రా మాట్లాడుతూ ఆశ్రా సంస్థ ద్వారా జిల్లాలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు మోసపోకుండా ఉండడానికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. వినియోగదారుడు కొనే ప్రతి వస్తువు పైన కొన్ని హక్కులు ఉంటాయని, ఆ విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన న్యాయమైన, స్థిరమైన జీవితం వైపు ముందడుగు వేయాలన్నారు. మోసపూరిత చర్యలు లేకుండా ముందుకు సాగాలని, సైబర్ క్రైమ్‌కు దూరంగా ఉండాలని వివరించారు. ఇటీవల పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజల అప్రమత్తం కావాలన్నారు. సైబర్ క్రైమ్ వలలో చిక్కకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ ఎస్ విశ్వేశ్వర రావు,డ్రగ్స్ కంట్రోల్ శ్రీనివాస్,ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కె వెంకటరత్నం, సివిల్‌సప్లయ్ అధికారి రమణ, ఎస్సై బి.హైమావతి పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గేదల ఇందిరా ప్రసాద్, పి ఆనంద్ గజపతి రావు, కట్టా పార్థసారధి, బాలకృష్ణ పట్నాయక్, జవహర్ నవోదయ విద్యాలయం వైస్ ప్రిన్సిపల్ బేతనస్వామి, ఉపాధ్యాయలు కె అనీరోజ్, ఆనంద్ రాజు,ఆదినారాయణ, మళ్లీ కర్జన్‌రావు, కెవిఆర్‌కె యాదవ్, బాబురావు, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాకుళం జిల్లా వికసిస్తోంది

**- ఆదర్శ అభివృద్ధి మోడల్‌లో హైలైట్‌గా నిలిచిన కలెక్టర్ కార్యాచరణ**

**- అభినందించిన ముఖ్యమంత్రి**




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా వేగవంతమైన అభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రూపొందించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రాష్ట్రవ్యాప్తంగా విశేషంగా చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఇటీవల విజయవాడలో జరిగిన జిల్లా అధికారుల సమావేశంలో ఆయన జిల్లాలో అమలు చేయబోయే అభివృద్ధి చర్యలను వివరిస్తూ, మౌలిక వసతుల విస్తరణ, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, సంక్షేమ రంగాల్లో వినూత్న మార్గదర్శకాలను ప్రతిపాదించారు.

**వ్యవసాయం నుంచి పారిశ్రామిక రంగం వరకు ప్రగతి ప్రణాళిక**

కలెక్టర్ రూపొందించిన 2025-26 జిల్లా అభివృద్ధి ప్రణాళిక మేరకు వ్యవసాయం, పశుపోషణ, హార్టికల్చర్, మత్స్యకార రంగాలతో పాటు ఖనిజ త్రవ్వకం, విద్యుత్, రవాణా, బ్యాంకింగ్, సేవా రంగాల్లో సమగ్ర ప్రణాళికలు రూపొందించబడ్డాయి. 10,000 హెక్టార్లలో పంట విస్తరణ, సోలార్ విద్యుత్‌లో 78మెగావాట్ల అదనపు సామర్థ్యం, మత్స్యరంగంలో 10% ఉత్పత్తి పెరుగుదల, గ్రామీణ, నగర అభివృద్ధి కోసం ఇళ్ల నిర్మాణం, రోడ్ల పునరుద్ధరణ వంటి కీలక కార్యక్రమాలు అమలులోకి రానున్నాయి.

**అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్న జిల్లా:**

2024-25లో రూ.11,606 కోట్ల వ్యవసాయ దిగుబడి 2025-26లో రూ.13,399 కోట్లకు చేరేందుకు, ఉత్పత్తి రంగం రూ.8,594 కోట్లకు, సేవారంగంకు రూ.23,071కోట్లకు పెరిగేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. చిన్న రైతులకు ఆధునిక సాంకేతికత, బ్యాంకింగ్, పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా ఉద్యోగ అవకాశాల కల్పన, రియల్ ఎస్టేట్ అభివృద్ధికి వేగవంతమైన అనుమతులు వంటి చర్యలు చేపడతామని కలెక్టర్ వెల్లడించారు.

**జిల్లా పురోగతికి ప్రధాన లక్ష్యాలు**

ఈ సందర్భంగా జిల్లా పురోగతి చెందడానికి అనువుగా ఉన్న ప్రధాన లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. పదహారు శాతం స్థూల జిల్లా ఉత్పత్తి పెంపు, పది శాతం వ్యక్తిగత ఆదాయం వృద్ధితో ఆర్థిక అభివృద్ధి సాధించే వీలు కలుగుతుందన్నారు. పదివేల హెక్టార్లలో పంట విస్తరణ, నూతన సాంకేతిక పద్ధతుల వినియోగం సాధించవచ్చన్నారు. ఇక పరిశ్రమల విషయానికి వస్తే ఎనిమిది సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కులు, రూ.150 కోట్లు పెట్టుబడి, పదిహేను వేల ఉద్యోగాలు నియమించుకునే అవకాశం ఉందన్నారు. 78 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి, 68వేల కుటుంబాలకు తాగునీటి సరఫరా, 4600 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాలు కల్పించవచ్చన్నారు. పర్యాటకపరంగా శ్రీకూర్మం, అర్యవల్లి దేవాలయాల అభివృద్ధి, మూడు నక్షత్రాల అతిథి గృహ నిర్మాణం, రెండు ఆహారోత్సవాల నిర్వహణ చేపట్టవచ్చన్నారు. ఇరవై అయిదు కిడ్ని వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక చికిత్స పడకలు, మూడు వేల నిఘా దృశ్య పరికరాలు, పద్దెనిమిది యంత్ర వాయు వీక్షణ పరికరాలు అందజేసి సమాజ రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

**ప్రభుత్వ మద్దతుతో వేగంగా ముందుకు..**

ఈ ప్రణాళికలను విజయవంతంగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్ ప్రభుత్వం నుండి రూ.47కోట్లతో రెవెన్యూ శాఖ కార్యాలయాల నిర్మాణం, నరేగా పథకం కింద పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు రూ.139 కోట్లు, హౌసింగ్ (హుదూద్ ఇళ్ల) పునర్నిర్మాణానికి రూ.9 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ కోర్స్‌కి 50 సీట్లు కేటాయించాలని కోరారు. సాగునీటి కాలువల మరమ్మత్తుల కోసం రూ.20 కోట్లు అవసరమవుతుందన్నారు.

**ముఖ్యమంత్రి ప్రశంస**

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ రూపొందించిన ప్రణాళికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందిస్తూ, "శ్రీకాకుళం అభివృద్ధికి ఇది ఆదర్శ ప్రణాళిక అని, దీని అమలుతో జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతుందని నమ్ముతున్నానన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# సస్పెండైన ఉపాధ్యాయులను రీవోక్ చేయాలి

**✦ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

డీఈవో తిరుమల చైతన్యను సస్పెండ్ చేయాలని, సస్పెండ్ అయిన ఉపాధ్యాయులను వెంటనే రివోక్ చేయాలని, ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు తక్షణమే ఎత్తివేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (స్టీరింగ్ కమిటీ) డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం జిల్లా అధికారులకు, ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి కార్యాచరణ సమితికి (స్టీరింగ్ కమిటీ) మధ్య చర్చలు జరిగాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర రావు, కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సూర్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సభ్య సంఘాల బాధ్యులు ఎస్.కిషోర్ కుమార్ (యుటిఎఫ్), తంగి మురళి (పిఆర్‌టియు), చౌదరి రవీంద్ర (యుటిఎఫ్), చావలి శ్రీనివాస్ (ఏపీటీఎఫ్), పి.రాజశేఖర్‌రావు (పిఆర్‌టియు) ఈ చర్చల్లో పాల్గొన్నారు. విద్యా రంగంలో టెన్త్ పరీక్షల పరిస్థితుల్లో ఇటీవల జరుగుతున్న పరిణామాలను వివరించడంతో పాటు పలు డిమాండ్లు అధికారుల ముందు ప్రవేశపెట్టారు. తక్షణమే డీఈవోను విధులు నుంచి తప్పించి ఎంక్వైరీ వేయాలని, ఇప్పటికే సస్పెండ్ అయిన చీఫ్ సూపరింటెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లు ఉపాధ్యాయులు అందరిని రివోక్ చేయాలని, ఉపాధ్యాయులపై పెట్టిన క్రిమినల్ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, విద్యార్థులకు వెంటనే పరీక్ష నిర్వహించాలని, లేకపోతే సప్లిమెంటరీ పరీక్షకు అనుమతించాలని, విద్యార్థుల కెరీర్‌పై ఈ ప్రభావం పడకుండా చేయాలని కోరారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా యధావిధిగా కొనసాగుతుందని ప్రకటించారు. సమస్య తక్షణమే పరిష్కరించని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా, డీఈఓ కార్యాలయం ముట్టడి ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. మూడో తేదీ నుంచి జరగబోయే టెన్త్ స్పాట్‌వాల్యూయేషన్‌ను ఉపాధ్యాయులు బహిష్కరిస్తారని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ప్రచురించిన కరపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారికి అందజేశారు.








## శ్రీ వేణుగోపాలునికి అష్టోత్తర పుస్తకార్చన



**(సత్యంన్యూస్, గార)**

శ్రీకాకుళం జిల్లా గార మండలం శాలిహుండం ప్రాచీన క్షేత్రంలోని 4వ శతాబ్దం నాటి శ్రీ కాళీయమర్దన వేణుగోపాల స్వామి ఆలయంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వర రావు, రమణమ్మ దంపతులు విశ్వజయము గ్రూప్‌సభ్యుల శ్రేయస్సు కోసం తమ స్వీయరచనగా కృష్ణం వందే జగద్గురుమ్ అనే 108 పుస్తకాలతో స్వామివారికి అర్చన చేయించి వాటిని భక్తులకు వితరణ చేయమని ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి, ప్రధానార్చకులు బంకుపల్లి వెంకట నాగేశ్వర శర్మలకు అందజేశారు. ఈ పుస్తకంలో శ్రీకృష్ణుని జీవితంతో ముడిపడివున్న, పురాణ ప్రసిద్ధ, విచిత్ర, విభిన్న నామాలతో గల సుప్రసిద్ధమైన, అద్భుతమైన 108 శ్రీకృష్ణుని ఆలయాల విశేషాలను, స్వామి చరిత్ర, స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అల్లూరి ఆనందవర్మ, గురుగుబెల్లి ప్రశాంత్, వనజాక్షి, రెడ్డి ప్రసన్న గాయత్రి, పొన్నాడ వంశీ, చాట్ల రాజారావు, అర్చకులు కిశోర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

# హస్తినాపురిలో 'రాము'లోరి మంత్రాంగం

**(మొదటిపేజీ తరువాయి)**

ఉన్నారు. కానీ వీరి బంధువులు, ఉత్తరాంధ్ర నుంచి మిగతా ప్రాంతాలకు విద్య, ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వెళ్లిపోయిన వారు ఇప్పటికీ ఓబీసీలు కాలేదు. ఇప్పుడు వీరిని కూడా ఓబీసీలు చేయాలని రామ్మోహన్ నాయుడు పట్టుపడుతున్నారు. మొదట్లో ఈ పనిని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు టేకప్ చేశారు. కానీ ఇప్పుడు ఆయన పేరు వినిపించడంలేదు. ఇక జిల్లాలో ఉన్న పొందర్లు ఉత్తరాంధ్రలో బీసీలు కాకముందే కేంద్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాలో ఉన్నారు. ఇక మిగిలింది కళింగకోమట్లు, శిష్ట కరణాలు, అరవలు, తూర్పుకాపులు మాత్రమే. శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో కళింగకోమట్లు, శిష్టకరణాలు, అరవలు తరపున ఎన్నికల్లో పోటీ చేయడం, అసలు టిక్కెటిచ్చే పార్టీలు లేకపోవడం వల్ల ప్రతీ ఎన్నికల్లోనూ వేవ్‌ను అనుసరించి వీరి ఓటుబ్యాంకు చీలిపోతుంది. అలా కాకుండా వీరిని ఓబీసీలో చేర్చడం ద్వారా గంపగుత్తగా పార్లమెంట్ స్థాయిలో అన్ని నియోజకవర్గాల్లోనూ ఓట్లు రాబెట్టుకోడానికి రాము అడుగులు వేస్తున్నట్టు అర్థమవుతుంది. జాతీయ బీసీ కమిషన్ ముందు శ్రీకాకుళంలో వెనుకబడిన కులాలు తమ వాదనను వినిపించే అవకాశాన్ని కూడా గతంలో రామూయే కల్పించారు. అయితే అప్పుడు వెళ్లిన కులసంఘ నేతలు పార్టీలవారీగా విడిపోవడంతో బీజేపీ ఎంపీలను పట్టుకొని వైకాపాతో అనుబంధం ఉన్న కులసంఘాలు, రామును కలుపుకొని టీడీపీతో అనుబంధం ఉన్న కులసంఘాలు ఎన్‌సీబీసీ చైర్మన్‌ను కలిశాయి. అయితే ఈసారి వైకాపాకు అడ్రస్ లేకపోవడంతో మిగిలిన మూడు పార్టీలు ఒకే గొడుగు కింద ఉండటంతో కుల సంఘాలన్నీ రాము నేతృత్వంలోనే వెళ్లాలని నిర్ణయించుకున్నాయి. అందులో భాగంగానే అందరూ కలిపి ఒకే వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ రాష్ట్రంలో కేంద్ర ఓబీసీ జాబితాలో చోటు కోసం 29 కులాలు ఎదురుచూస్తున్నా ఈ ఐదు కులాలను చేర్చడం కోసం రాము చేస్తున్న యత్నం ఫలిస్తే రాము మంత్రాంగం నెరవేరినట్లే.



### రాముకు రుణపడివుంటాం

తమను ఓబీసీలో చేర్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు రుణపడివుంటామని జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు (వాసు) పేర్కొన్నారు. గురువారం ఢిల్లీ నుంచి 'సత్యం'తో మాట్లాడిన ఆయన కేంద్ర సామాజిక న్యాయశాఖామంత్రితో కలిసే అవకాశం తమకు ఎప్పటికీ రాదని, అటువంటి సందర్భాన్ని సృష్టించి, అక్కడ జిల్లాలో బీసీల తరఫున మాట్లాడే అవకాశాన్ని కల్పించిన రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.






## 30న పంచాయతన దేవాలయంలో
# పంచాంగశ్రవణం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకొని ఈ నెల 30న పీఎన్ కాలనీలోని పంచాయతన దేవాలయంలో పంచాంగ శ్రవణం ఉంటుందని పి.జగన్మోహనరావు, ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. జ్యోతిర్విద్యా భూషణ అళగిరి కిశోర్‌చే శ్రీ విశ్వావసు నామ సంవత్సర ధృక్ సిద్ధాంత పంచాంగ ఆవిష్కరణ ఉంటుందని, అలాగే పంచాంగ శ్రవణం జరుగుతుందని ఆ ప్రకటనలో వివరించారు. అనంతరం పంచాంగ కర్త అళగిరి కిశోర్‌కు సన్మానం జరుపుతామన్నారు.


శ్రీకాకుళం జిల్లా ప్రజలకు శుభవార్త

ప్రముఖ ప్రసూతి మరియు స్త్రీవైద్య నిపుణులు

తేది: 5-4-2025 శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా చూడబడును.

డా॥ బొడ్డేపల్లి మీనాక్షి M.B.B.S., DGO

ప్రసూతి మరియు స్త్రీ వైద్యనిపుణులు

హిమోగ్లోబిన్, షుగర్ టెస్టులు ఉచితంగా చేయబడును.
అవసరమైనచో థైరాయిడ్ టెస్ట్ 50% రాయితీతో చేయబడును.
ఉచితంగా ఓపీ చూడబడును. ఈ అవకాశం ఈ ఒక్కరోజు మాత్రమే.

తేది: 5-4-2025 శనివారం
ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు

-: ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవలెను :-

శ్రీ వైష్ణవి గణేష్ డాక్టర్స్ ప్లాజా

డే & నైట్ జంక్షన్, పెట్రోల్ బంకు ఎదురుగా,
సత్య లాడ్జి ప్రక్కన, శ్రీకాకుళం, సెల్: 99854 69073, 98661 68604, 70755 18604














Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.